76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv

# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి 13-1-2019 ఆదివారం సంపుటి : 1 సంచిక 1 'రాజధాని వార్తలు' తెలుగు దిన పత్రిక రూ. 2.00 పేజీలు 4



వివరాలు2లో...  నేటి భారతం

వివరాలు3లో...  ఆకతాయిల ఆట కట్టించే శక్తి బృందాలు

వివరాలు4లో...  రాజ్యాంగ సంస్థలపై మోడీ ఉక్కుపాదం

వివరాలు4లో...  సంక్రాంతి పిండి వంటలు




# ప్రయాణీకులకు చార్జీల బాదుడు



## నిలువు దోపిడీ చేస్తున్న ఆర్టీసీ, రైల్వే, విమానయాన సంస్థలు

**ఉరుకులు పరుగుల నగరజీవితంతో విసిగిపోయిన ఉద్యోగులు, వ్యాపారులు సంక్రాంతికి తమ గ్రామాలకు వెళ్లి, కుంటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సేదతీరుదామంటే ప్రభుత్వం చార్జీలు ఐదారు రెట్లు పెంచి, నడ్డి విరిస్తోంది. ఇంతకు ముందు ఆర్టీసీ బస్సులే ఈ దోపిడీకి పాల్పడుతుంటే.. ఇప్పుడు రైల్వేలు కూడా జత చేరాయి. ఇక విమాన చార్జీలయితే చెప్పనవసరం లేదు సరికదా.. హైదరాబాద్ నుంచి విజయవాడ లేదా విశాఖకు వెళ్లడం కన్నా ప్యాకేజీల్లో విదేశాలకు వెళ్లి వారం రోజుల ఎంజాయ్ చేయడమే చౌకగా ఉంది. ఇదిలా ఉండగా ప్రభుత్వం అమరావతి కట్టడాలను ప్రజల సందర్శనార్థం ఉచితంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది.దీంతో ప్రభుత్వానికి మోపెడు ఖర్చు అవుతుండగా, బస్సులు లేక ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు.**

**రాజధాని వార్తలు బ్యూరో- అమరావతి:** ప్రైవేటు సంస్థలు తమ టికెట్లను అధిక ధరలు అమ్ముతుంటే చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రభుత్వం కూడా అదే బాటపడితే ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రయాణీకులు ఆవేదన చెందుతున్నారు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే సాధారణ టికెట్ ధరల కంటే మూడు రెట్లు అధిక చార్జీలు వసూలు చేస్తోంది. జన సువిధ రైళ్లలో ఆర్ఏసీ పేరుతో ఉన్న బెర్తుల కంటే ఎక్కువ టికెట్లు విక్రయించడం దీనికి నిదర్శనం. సాధారణ చార్జీతో పోలిస్తే ఆర్ఏసీ టికెట్లకు ఐదారు రెట్లు అధికంగా వసూలు చేయడమే కాకుండా ఒక బెర్తును ఇద్దరికి కేటాయించడం రైల్వే శాఖ దోపిడీకి పరాకాష్ట అని ప్రయాణికులు మండిపడుతున్నారు.



సంక్రాంతి రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి విజయవాడ, కాకినాడ, నర్సాపురం, విశాఖ నగరాలకు జనవరి 10 నుంచి 13 వరకు, తిరుగు ప్రయాణానికి అనుగుణంగా 'సువిధ' ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. సికింద్రాబాద్- కాకినాడ మధ్య రోజుకు రెండు, మూడు సువిధ రైళ్లు నడుపుతోంది. స్లీపర్, ఏసీ క్లాస్ టికెట్లతోపాటు ఆర్ఏసీ టికెట్లనూ ఇప్పటికే పెద్ద సంఖ్యలో విక్రయించింది. ఇవి పూర్తయ్యాక వెయిటింగ్ లిస్ట్ టికెట్ల కేటాయింపునకు వెళ్లింది. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు సాధారణ చార్జీ రూ.220 కాగా, సువిధ రైళ్లలో డైనమిక్ ఫేర్‌లో గరిష్ట ధర రూ.1,065గా నిర్ణయించారు. సికింద్రాబాద్- విశాఖపట్నం స్లీపర్ చార్జీ రూ.360 కాగా, సువిధలో రూ.1365 వసూలు చేస్తున్నారు. పైగా ఆర్ఏసీ టికెట్లలో ఒక బెర్తును ఇద్దరికి కేటాయించడానికి పూనుకున్నారు. ఈ విధానం సాధారణంగా రైళ్లలో ముందు నుంచే ఉన్నదే అయినా ఐదారు రెట్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్న సువిధ రైళ్లలోనూ దాన్ని అమలుచేయడం ఏమిటని నిలదీస్తున్నారు. టికెట్ రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు ఎవరైనా దానిని రద్దు చేసుకున్న పక్షంలో ఆర్ఏసీ వారికి ఆ బెర్తు కేటాయిస్తారు. పండగ సమయంలో మూడు నుంచి నాలుగు రెట్ల అధిక చార్జీతో టికెట్ కొన్నవారు ప్రయాణం రద్దుచేసుకునే అవకాశాలు ఉండవని రైల్వే అధికారులే అంటున్నారు. అంటే గమ్యస్థానం చేరే వరకు బెర్తులో పడుకునే అవకాశం ఉండదన్నమాట. అధికారులకు ఈ విషయం తెలిసినా రెట్టింపు ధరలు వసూలు చేస్తూ ప్రయాణికులను దోచుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు మండిపడుతున్నారు.

### అరకొరగా ఆర్టీసీ బస్సులు

### ప్రత్యేక బస్సులకు 50శాతం ఆదనపు ఛార్జీలు

ఆర్టీసీ, రైల్వే వీరిని మించి ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణీకులను నిలువునా దోచేస్తున్నారు. ఇదిలా ఉండగా, పోలవరం తరహాలోనే రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా ప్రజలకు చూపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ఆ బాధ్యతను నిర్వర్తిస్తోంది. రాష్ట్ర నలు మూలల నుంచి ప్రజలను ఆర్టీసీ బస్సుల్లో అమరావతిని సందర్శించేందుకు 'అమరావతి ప్రజాయాత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒక రోజు సమయం పట్టే ఈ యాత్రలో వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు, యువకులు, రైతులు ఇలా.. వివిధ వర్గాలకు చెందన వారిని బస్సుల్లో అమరావతికి తరిలిస్తోంది. భవన నిర్మాణ పనులను చూపించి, వివరించేందుకు ప్రత్యేకంగా అధికారులను కూడా నియమించింది. వీరు గైడ్ అవతారమెత్తి సందర్శకులను వివిధ ప్రాంతాల్లో తిప్పుతున్నారు. ప్రయాణ ఖర్చులతోపాటు అల్పాహారం, భోజన సదుపాయాలను సీఆర్‌డీఏనే భరిస్తోంది. ఒక్కొక్కరికి సుమారు రూ. 1000ల నుంచి రూ. 1500 వరకూ వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి నెల వరకూ ప్రణాళికను రూపొందించిన

- మిగతా 2 లో

# పండగకు ఊరు వెళ్లుతున్నారా..?

- దొంగలున్నారు జాగ్రత్త
- లాస్ట్ హౌసెస్ మానిటరింగ్ సిస్టమ్ నమోదు చేసుకొండ



**రాజాధాని వార్తలు, విజయవాడ :** సంక్రాంతి పండగకు సొంత ఊరు వెళ్లాలనుకున్నవారికి దొంగలు భయం వెంటాడుతుంది. అపార్ట్‌మెంట్‌ల్లో సైతం చెడ్డిగ్యాంగ్‌లు చెలరేగిపోతున్నాయి. నగరం పరిధి ఎక్కువగా వుండడంతో శివారు ప్రాంతంలో వున్న ధనవంతుల ఇళ్లల్లో చోరీలకు దొంగలు పథక రచన చేస్తున్నారన్న సంకేతాలు పోలీసులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరో పక్క సరదాగా సోంత ఊరుకు వెళ్లాలకున్న వారికి దొంగలు భయం అధికమైంది. కళ్లలన్ని ఇళ్లవైపే పెట్టుకుని పక్కంటివాళ్లను చూడమని చెప్పి వెళ్తుతున్న వారంతా పోలీసులకు సమాచారం అందిస్తే మంచిదని పోలీసులు తెలియజేస్తున్నారు. సంక్రాంతి పండగకు ఊరు వెళ్లితే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయకుంటే తిరిగి వచ్చేలోగ ఇళు ్లను దోచేయడం ఖాయం. విశాఖతో పాటు రాష్ట్రంలో పెద్ద నగరాలైన విజయవాడ, తిరుపతి, గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, కడప, నెల్లూరు, లాంటి నగరాల్లో దొంగలు మాటువేసి పండగ కోసం ఎదురుచూస్తున్నారు. అనేక సార్లు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు తెల్లవారేసరికి ఘరానా దొంగలు ఆ ఇంటిని లూటీ చేసేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఉపాధి కోసం నగరానికి వచ్చిన కొంతమందితో పాటు నగరంలోని నేరగాళ్లు కొందరు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇలాంటి నేరస్తులను పట్టుకునే పోలీసులు

- మిగతా 2 లో

# కోడి పందేలకు సై

**పంతం నీదా,నాదా 'సై'... అంటూ పందెం కోళ్లు కాలు దువ్వుతున్నాయి. సంక్రాంతి పండుగకు పోలీసులు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. వచ్చేది ఎన్ని కల సమయం కావడంతో అనుమతులకు ఇక అడ్డే ఉండదని బాహాటంగానే చెబుతున్నారు. జిల్లా అంతటా జరిగే ఈ పందేలకు కొందరు ప్రజాప్రతినిధులు, నాయకుల కనుసన్నల్లో ఏర్పాట్లు గప్‌చుప్‌గా జరుగుతున్నాయి.**

- ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే కార్యకలాపాలు
- ముఖ్యులకు అందిన ఆహ్వానాలు



**రాజధాని వార్తలు, అమరావతి :** కోడి పందేలు, ఇతరత్రా వాటిని అడ్డుకుంటామని మొదట్లో పోలీసులు హెచ్చరికలు జారీ చేయడం.. చివరికి ప్రేక్షకపాత్ర వహించడం ఏటా చూస్తున్న బాగోతమే. ఈ సంక్రాంతికి ఆదే ధీమాతో కోడిపందేలు, జూదం నిర్వాహకులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో పెనమలూరు, నున్న గన్నవరం. వుయ్యూరు, నూజివీడు, తరువూరు, బందరు, మైలవరం మండలాలతోపాటు పలు గ్రామాల్లో అనేక చోట్ల బదులు సిద్ధమవుతున్నాయి. అలాగే కొన్ని చోట్ల కోడిపందేలు రహస్య ప్రదేశాల్లో జరిపేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆటలు చాలా చిన్నవిగా కనిపిస్తున్నా పందేలు రూ.వేలల్లో కాస్తారు. కొన్ని చోట్లయితే రూ.లక్షల్లో ఉంటాయి. ఆటల ప్రదేశాలు పోలీసులకు తెలిసినా చూసీచూడనిట్లుగా వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.కోడి కాకి, కాకి దేగ, మైలా పచ్చకాకి దేగ,

- మిగతా 2 లో

# ఏపీలో రెండు కీలక ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు కీలక ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సీఎం శంకుస్థాన చేశారు. రూ.1387 కోట్లతో 3.2 కిలోమీటర్ల మేర ఐకానిక్ వంతెన నిర్మాణం జరుగనుంది. ఇబ్రహీంపట్నం-ఉద్దండరాయునిపాలెంను

- మిగతా 3 లో

## ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| విజయవాడ | 30 | 17 |
| విశాఖపట్నం | 27 | 19 |
| తిరుపతి | 30 | 16 |

# రైతు కష్టం... దళారుల భోజ్యం

**ఓ వైపు పెథాయ్ తుపాను ప్రభావం..మరో వైపు ప్రభుత్వ నిబంధనలు... దళారుల మోసాలు వెరసి జిల్లాలో రైతన్న పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం వద్ద కష్టానికి తగిన ప్రతిఫలం దొరకడంలేదు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఒక ప్రహసనంలా మారింది. అన్ని అవరోధాలు అధిగమించి పంటను కొద్ది మొత్తంలో కాపాడుతున్న కర్షకుడిని దళారులు దారుణంగా ముంచేస్తున్నారు. రైతు పొలంలో అడుగెట్టి వారు సాగిస్తున్న దందా అంతా ఇంతా కాదు. ధరలను ఏమార్చి అన్నదాతకు తీరని నష్టం కలిగిస్తున్నారు.**



- జిల్లాలో ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్ల
- రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్న ప్రభుత్వ నిబంధనలు
- క్వింటాకు రూ.300 నుంచి రూ.400 నష్టంపోతున్న రైతన్న

**రాజధాని వార్తలు, అమరావతి :** జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.49 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. ఇప్పటికే 95 శతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. రైతుల నుంచి ధాన్యం సేకరణకు 49 మండలాల పరిధిలో 269 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 9.40 లక్షల మెట్రిక్ టన్నులు

- మిగతా 3 లో




## రాజధాని వార్తలు కలం

### దుందుడుకు నిర్ణయాలు C/O మోడీ

ప్రధాని మోడీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం దుందుడుకు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. అవగాహనాలేమితో దేశాన్ని అల్లకల్లోలం చేసే ప్రక్రియలో ఆయన దూకుడు ప్రదర్శిస్తున్నారు. అర్థాంతరంగా పెద్దనోట్ల రద్దు చేపట్టిన మోడీ నల్లధనం బయటికొస్తుందన్నారు. నల్లధనం బయటకు రాలేదుసరికదా... అదంతా తెల్లధనంగా మారిపోయింది. దీనిపై ఈనాటికీ సరైన సమాధానం చెప్పలేని ఆయన ప్రజలను తీవ్ర ఇబ్బందులకు లోను చేసి, 150 మంది మృతికి కారణమయ్యారు. జీఎస్టీ అమలు కూడా అంతే తొందరపాటుతో అర్ధరాత్రి పార్లమెంటు సమావేశం నిర్వహించి హడావుడిగా అమలు చేశారు. ఎన్నికలు ముంచుకొచ్చిన వేళ ఇప్పటికే ఐదురాష్ట్రాల్లో ఎదురుదెబ్బతినడంతో హడావుడిగా చివరి పార్లమెంటు సమావేశాల్లో అగ్రవర్ణపేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అధ్యయనం, సంప్రదింపులు, చర్చలు ఏవీ జరగకుండానే తీసుకున్న నిర్ణయాలుగా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

వాస్తవానికి అగ్రకులాలకు రిజర్వేషన్ల ప్రతిపాదన మండల్‌కమీషన్ నాటి నుంచి ఉంది. 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం , 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం ఈ ప్రతిపాదన తీసుకు వచ్చినా అడుగు ముందుకు పడలేదు. కేరళ, హర్యానా, గుజరాత్,మహారాష్ట్ర కూడా ఇవే ప్రయత్నాలను చేసి చేతులు కాల్చుకున్నాయి. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవని, 50 శాతం మించరాదని, 1992లో సుప్రీంకోర్టులో ఇందిరా సహానీ వెలువరించిన తీర్పును మోడీ ఉద్దేశపూర్వకంగా అతిక్రమించారు. దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకోని ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ ప్రతిపాదనను తెచ్చి ప్రతిపక్షాలను ఇరుకున పెట్టి, పెద్దల సభలోకూడా ఈ బిల్లును పాస్ చేసేలా స్కెచ్ వేసింది.

ఇదంతా ఒక ఎత్తైతే.. ఈ రిజర్వేషన్‌తో ఎంతమందికి ప్రయోజనం చేకూరుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏడాదికి రూ. 8 లక్షల ఆదాయం, 1000 గజాలకు మించని ఇంటిస్థలం, ఐదెకరాల్లోపు పొలం ఉన్నవారికి ఈ రిజర్వేషన్లను అమలు చేస్తామనడం ఆశ్చర్యం కలిగించక మానదు.. ఏడాదికి రూ. 8 లక్షల ఆదాయం అంటే నెలకు రూ. 65వేల జీతం అన్నమాట.. అంత సంపాదించేవారు పేదలు అవుతారా ? ఎస్సీ, ఎస్టీలకు ఇది రూ. 2.50 లక్షలుగా ఉంది. ఐదెకరాలపొలం అంటే ఎన్ని పంటలు పండేది ? పంటకు ఎంత వస్తుంది అన్నలెక్కలు లేవు.వాస్తవానికి ప్రభుత్వ అలక్ష్యం, పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో రైతుల భూములను ప్రభుత్వాలు సమీకరణ , ప్రకృతి విపత్తులు, దళారీ వ్యవస్థ లేకుంటే రైతేరాజు.. గుడెసె వేసుకునే జాగా లేని కుటుంబాలు కోట్లకొద్దీ ఉండగా వెయ్యి గజాలాలోపు ఇళ్లస్థలం ఉన్నవాళ్లను ఈ రిజర్వేషన్లకు అర్హులుగా చేయడం ఎంతవరకు సబబు? ఈ నిబంధనలతో అగ్రవర్ణాల పేదలకు అసలు న్యాయం జరగే పరిస్థితే లేదు.


నెలకు 18వేల రూపాయలను కనీస వేతనంగా నిర్ధారించాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది. అంటే ఏడాదికి 2.16 లక్షల రూపాయలు! ఆదాయపరిమితిని 2.5 లక్షల నుండి కనీసం 5 లక్షల రూపాయలకైనా పెంచి అంతవరకు ఆదాయపన్నుకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. దాన్ని నిరాకరించిన ప్రభుత్వం ప్రస్తుతం రూ. 8 లక్షలలోపు ఆదాయం వచ్చేవారంతా పేదలే అంటోంది. పన్నులు వసూలు చేసేటప్పుడు వారు పేదలు కాదు... ఓట్లు దండుకునేవేళ వారంతా పేదలే..! నయవంచన! ప్రస్తుత దేశవ్యాప్తంగా 90శాతం మంది రిజర్వేషన్ల పరిధిలోకి వచ్చిన తరువాత వాటి ప్రయోజనాలు అందేదెవరికి?

మాజీ ప్రధాని మన్మోహన్ హయాంలోని 2010లో 8.65 శాతం ఉద్యోగ కల్పన ఉండగా, 2011లో 9.10 శాతం, 2012లో 3.22, 2013లో 4.19, 2014లో 4.93 శాతంగా ఉంది. ప్రధాని మోడీ హయాం 2015లో 1.35శాతం ఉండగా, 2016లో 2.31గా ఉంది. 2017 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆ సమాచారాన్ని ప్రకటించడం మానేసింది. అయితే బీజేపీ హయాంలో 70 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్న మోడీ, తన హయాంలో కోటికి పైగా ఉద్యోగాలు కోల్పోయిన విషయాన్ని ఎందుకు చెప్పరని మహారాష్ట్రలోని శివసేన పార్టీ పత్రిక సామ్నా తన డిసెంబరు మొదటి వారం సంపాదకీయంలో ప్రశ్నించింది. మోడీ సగర్వంగా ప్రచారం చేసుకుంటున్న బేటీ పడావో .. బేటీ బచావో అంటూ మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్నామని డప్పాలు కొట్టుకుంటూ 65లక్షల మంది మహిళల ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ నిర్వాకం ఇది. ఉద్యోగ అవకాశాలు కల్పించలేని కేంద్రాన్ని ప్రజలు పదిశాతం రిజర్వేషన్లను ఎంతవరకు నమ్మారో సార్వత్రిక ఎన్నికల్లో తెలుస్తుంది.

# నేటి భారతం

## (2016 జనవరి 17న జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్యకు నివాళిగా)

**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యతో దేశం ఉలిక్కిపడింది. విద్యాసంస్థల్లో కులాల కుంపటి ఎంత తీవ్రంగా ఉందో ప్రపంచానికి తెలిసింది ఈ ఘటనతోనే.. దేశంలోని అణువణువున, మైనార్టీలు, దళితులు ఎంతటి దురాగతాలకు, వివక్షకు గురవుతున్నారో తెలిపే మొదటి ఘటన మన తెలుగువాడికే జరగడం దురదృష్టం.**



అసలు రోహిత్ ఆత్మహత్మకు కారణం ఏమంటే..2015 జూలై 30న ముంబై పేలుళ్ల కేసులో నిందితుడైన యాకూబ్ మెమెన్ ఉరిని నిరసిస్తూ హెచ్‌సీయూలోని షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కొందరు విద్యార్థులతో కలిసి అంత్యక్రియల అనంతరం జరిపే ప్రార్థనలను అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్(ఏఎస్ఏ) నిర్వహించింది. దీనిపై అదేరోజే ఏబీవీపీ విద్యార్థి సంఘం నిరసన వ్యక్తం చేసింది. ఆగస్టు 1న, ఢిల్లీ యూనివర్సిటీలో ప్రదర్శించిన 'ముజఫర్‌నగర్ బాకీహై' అనే డాక్యుమెంటరీని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏబీవీపీ ప్రదర్శించింది. ఈ డాక్యుమెంటరీపై అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్(ఏఎస్ఏ) నిరసన వ్యక్తం చేసింది. ఈ నిరసనపై ఏఎస్ఏ సభ్యులను గూండాలుగా పేర్కొంటూ ఏబీవీపీ విద్యార్థి సుశీల్ కుమార్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీంతో ఆ సంస్థకు చెందిన 40 మంది విద్యార్థులు సుశీల్ వద్దకు వెళ్లి క్షమాపణ చెప్పాలని కోరడంతో వర్సిటీ సెక్యూరిటీ అధికారి సమక్షంలో ఆయన లిఖితపూర్వకంగా క్షమాపణ తెలిపారు.అయితే తెల్లవారిన తర్వాత ఏఎస్ఏ తనపై మూక దాడి జరిపిందని సుశీల్ తల్లిదండ్రులు కేసు పెట్టారు. అది అపెండిసైటిస్ (24 గంటల కడుపుల నొప్పి) వల్ల జరిగిందేగాని తాము దాడి చేయలేదని వారు స్పష్టం చేశారు. అయితే బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో నిరసన ప్రదర్శన చేయగా, ఈ ఘటనపై విచారణ కమిటీ వేశామని దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తాత్కాలిక వీసీ శర్మ హామీ ఇచ్చారు. ఆపై దాడి చేశారన్న ఆధారాలు లేవని కమిటీ తేల్చిచెప్పింది. సెప్టెంబరులో వర్సిటీ పూర్తిస్థాయి వీసీగా అప్పారావు నియమితులయ్యారు. తర్వాత వచ్చిన నివేదికలో ఐదుగురు ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్ గదికి వెళ్లారని, ఆ ఐదుగురిని క్యాంపస్ నుంచి బహిష్కరించాలని పేర్కొంది.హెచ్‌సీయూలో కులరాజకీయాలకు, జాతివ్యతిరేక కార్యక్రమాలకు యూనివర్సిటీ నిలయంగా మారిందంటూ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ మానవవనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి లేఖరాశారు. నవంబరు మధ్యలో తన కుమారుడిపై దాడి సుశీల్‌కుమార్ తల్లి హైకోర్టు మెట్లెక్కడంతో అఫడివిట్‌ను దాఖలు చేయాలని వర్సిటీని కోర్టు ఆదేశించింది. 2016 నవంబరు 27న ఆ తర్వాత ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సిఫారసుతో ఐదుగురు విద్యార్థులపై బహిష్కరణ వీసీ అప్పారావు ఆమోద ముద్ర వేశారు. ఈ బహిష్కరణ నిబంధన సెమిస్టర్ (6నెలల) వ్యవధి వరకూ వర్తిస్తుందని అందులో ఆయన పేర్కొన్నారు. డిసెంబరు 20న ఐదుగురు విద్యార్థులను యూనివర్సిటీ హాస్టల్ ఖాళీ చేయాల్సిందిగా చీఫ్ వార్డెన్ ఆదేశించారు. దీంతో విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. జనవరి 3న బహిష్కరణకు గురైన ఐదుగురు విద్యార్థులు ఆరోజు నుంచి ఆరు బయటే ఉంటూ తమ నిరసన తెలియజేసినా ప్రయోజనం లేకుండా పోయింది.జనవరి 17న న్యూ రీసెర్చ్ స్కాలర్ హాస్టల్‌లోని రూంలో సీలింగ్ ఫ్యానకు ఉరివేసుకుని రోహిత్ వేముల మరణించాడు. ఇప్పటివరకు ఆ పేద కుటుంబానికి న్యాయం దక్కలేదు. ఈ ఘటనపై మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ స్పందించనే లేదు..



రోహిత్ వేముల




### దళిత ఓట్లపై బీజేపీ కన్ను

ఈ ఘోర ఘటనలను దేశం మర్చిపోయిందనే బీజేపీ భావిస్తోంది. ఓట్లకాలం రావడంతో వారికి గాలం వేసే పనిలో పడింది. అందులో భాగంగా 'భీమ్ మహా సంగమ్ విజయ్ సంకల్ప్' పేరుతో ఢిల్లీలో బీజేపీ భారీ ర్యాలీ నిర్వహించనున్నది. ఆదివారం జరగనున్న ఈ ర్యాలీలో ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు ఆ పార్టీ నాయకులు ఐదువేల కిలోల కిచిడీని 750 కిలోల కుండలో వండుతున్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా అధ్యక్షతన ఈ ర్యాలీ జరుగుతోంది. దళితుల ఇళ్ల నుంచి సేకరించిన బియ్యం, ధాన్యాలతో ఈ భారీ వంటకాన్ని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో తయారు చేస్తారు. అనంతరం దీనిని అందరికీ పంచిపెడతారు. తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం దళిత సామాజిక వర్గాలకు చేస్తున్న మేలు గురించి అమిత్ షా మాట్లాడుతారు. నవంబరు 2017లో కూడా బీజేపీ ఇలాంటి కార్యక్రమం చేపట్టింది. ఆ సమయంలో ఆహార మంత్రిత్వశాఖ నిర్వహించిన ప్రపంచ ఫుడ్ ఇండియా ఫెస్టివల్‌లో భాగంగా ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ 918 కిలోల కిచిడీని వండారు. ఇప్పుడు బీజేపీ ఏకంగా 5,000 కిలోల కిచిడీ వండనుంది.

**దళితులను పశువులకన్నా హీనంగా చూస్తూ,...** ఒక్కపూట భోజనంతో వారి ఓట్లు రాబట్టాలని చూసే బీజేపీ ఆశ ఎంతవరకు నెరవేరుతోందో వేచి చూడాల్సిందే.

– బోస్

## ఉనా దారుణం

**2016 జూలై 7న గుజరాత్‌లోని గిర్ సోమ్‌నాథ్ జిల్లాలో గల ఉనా పట్టణ వీధుల్లో.. ఐదుగురు దళితులను కొట్టి, బట్టలు విప్పి ఊరేగించిన ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వీరంతా ఆవులను చంపుతున్నారని 'గో రక్షకులు' ఆరోపించారు. కానీ తాము చనిపోయిన ఆవుల చర్మం ఒలుస్తున్నామని దళితులు చెప్తున్నారు. పశువుల కోసం మనుషులపై అమానవీయంగా ప్రవర్తించిన ఈ ఘటన భారత్‌ను అంతర్జాతీయంగా అప్రదిష్టపాలు చేసింది.**

వాశ్రామ్ సర్వాయియా (55),ఆయన ముగ్గురు సోదరులు ఈ అఘాయిత్యానికి గురయ్యారు.ఆ దారుణ అవమానం, మానసిక క్షోభ నుంచి ఈ బాధితులు నలుగురూ ఇంకా కోలుకోలేదు. బాలూభాయ్, ఆయన కుటుంబం.. ఉనా తాలూకా లోని మోటా సమాధియాలా గ్రామం దళిత్–ఫాలియాలో ఒక చిన్న చీకటింట్లో నివసిస్తుంటారు. బాధితుల్లో అందరికన్నా చిన్నవయస్కుడు అశోక్ సర్వాయియా. "ఆ రోజు ఏం జరిగిందో తలచుకుంటే ఇప్పటికీ నాకు భయమేస్తుంది. వాళ్లు మళ్లీ వచ్చి మమ్మల్ని కొడతారేమో అనిపిస్తుంది" అని అతడు మీడియా ప్రతినిధులతో చెప్పాడు. ఆనాడు జరిగిన భయానక సంఘటన గురించి వివరిస్తూ, ఆ ఘటన జరిగినప్పటి నుంచి బాధితులెవ్వరికీ ఉపాధి లేదు. పొలాల్లో కూలీలుగా పనిచేసే శలేదు. ఆ ఘటన తర్వాత అశోక్ వ్యవసాయ కూలీగా పనిచేయటానికి విఫల యత్నాలు చేశాడు. అతడు రాత్రి పూట నిద్ర కూడా పోలేకపోతున్నాడని అతడి తల్లి తెలిపింది."అశోక్‌కి పడుకోగానే పీడ కలలు వస్తాయి. అర్ధరాత్రిళ్లు ఉలిక్కిపడి లేస్తాడు. ఇప్పుడు అతడిని చిన్న పిల్లాడిని చూసుకున్నట్లు నేను చూసుకోవాల్సి వస్తోంది" అని అతడి భార్య కున్వార్ బెన్ చెబుతోంది. వడ్గామ్ ఎంఎల్ఏ, దళిత నాయకుడు జిగ్నేశ్ మేవాని గుజరాత్ అసెంబ్లీలో లేవనెత్తిన ఒక ప్రశ్నకు సమాధానంలో.. ఉనా బాధితులకు ఎలాంటి ప్రయోజనాలైనా కల్పించేందుకు అధికారిక హామీ ఏదీ ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది.ఈ ఘటన 2016లో దళితులకు దేశవ్యాప్తంగా మద్దతు కూడగట్టింది. ఉనా బాధితులకు మద్దతుగా మేవానీ ప్రదర్శన చేపట్టిన తర్వాత ఆయన పేరు ప్రతి ఇంటా మారుమోగింది.కేవలం దళితుల నుంచే కాకుండా చాలా ఇతర సమాజాల నుంచి కూడా మద్దతు, సానుభూతి లభించిందని దళిత ఉద్యమకారుడు మార్టిన్ మక్వాన్ చెప్పారు."నేటి భారతదేశంలో దళితుల వాస్తవ పరిస్థితికి సంబంధించిన కఠోర వాస్తవంగా ఉనా ఘటన తెరపైకి వచ్చింది" అని ఆయన పేర్కొన్నారు.






గుంటూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులతో గుంటూరులోని ఓ ప్రైవేట్ హొటల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం మరియు సన్మాన కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఏ. ఎస్ .రామకృష్ణ - కిరణ్ కుమార్ గుంటూరు

**ఇక్కడ కనిపించే రోడ్డు నిండా చెత్త చెదారం , ఆవులు. ఈ రోడ్డులో ఎవరు ఉంటారో తెలుసా, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ మంగళగిరి అభ్యర్థి అయిన కాండ్రు కమల. ఓ మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్దే ఇలా ఉంటే ఇక సామాన్య మానవుల గతి ఏంటి. మంగళగిరిలోని పారిశుద్ధ్యం పరిస్థితి ఇంత దారుణంగా ఉన్న ప్రభుత్వం పట్టించుకునేదెన్నడో?**

- మంగళగిరి






## ఊరు వెళ్లుతున్నారా..?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ని చర్యలు తీసుకుంటున్నా పూర్తిస్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. దీంతో టెక్నాలజీ సహాయంతో ఇళ్ల చోరీలను శతశాతం అడ్డుకట్టవేయవచ్చునని భావించారు. అందులో భాగంగా లాస్ట్ హౌసెస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)యాప్‌ను ప్రవేశపెట్టింది. దీన్ని ప్రజలు డౌన్‌లోడ్ చేసుకున్న సరే, లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో ఇంటి అడ్రస్ వివరాలను తెలియజేస్తే పోలీసులు మనం తిరుగోచ్చే వరకు ఆ ఇంటికి సీసీ కెమెరాలు అమర్చి కంట్రోల్ రూమ్ నుంచి అనునిత్యం పర్యవేక్షణ చేస్తుంటారు. ఆండ్రాయిడ్ ఫోన్ కలిగి వున్నావారు గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి వుంటుంది. డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత యాప్‌ను ఓపెన్ చేసి తమ పేరు, ఫోన్ నంబర్, ఇంటి చిరునామాను అందులో పొందుపరిస్తే కంట్రోల్‌రూమ్‌లోని ఎల్‌హెచ్‌ఎంఎస్ పర్యవేక్షణ సెల్‌లో రిజిస్టర్ అవుతుంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారైనా ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి ఊరెళ్లాల్సి వచ్చినప్పుడు ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి వుంటుంది. ఎప్పుడు ఊరెళ్లి ఎప్పుడు తిరిగివస్తారనేది చెబితే ఊరు వెళుతున్న రోజు ఇంటికి నేరపరిశోధన విభాగం పోలీసులు వెళతారు. ఇంట్లో విలువైన వస్తువులు వుంచిన ప్రాంతాన్ని ప్రధానంగా కవర్‌చేసేలా ఒక కెమెరాను ఎవరికీ కనిపించకుండా ఆమర్చుతారు. కెమెరా రికార్డు చేసే దృశ్యాన్ని కంట్రోల్‌రూమ్‌ను ప్రత్యక్షంగా ప్రసారం చేసేందుకు వీలుగా వైఫై మోడెమ్‌ను కూడా ఇంట్లోనే ఏర్పాటు చేస్తారు. దీని వల్ల ఇంటికి తాళం వేసివుండగా ఎవరైనా ఆ ఇంట్లోకి ప్రవేశిస్తే కంట్రోల్‌రూమ్‌లోని సిబ్బందికి అలెర్ట్ మెసేజ్ అందుతుంది. దీని ఆధారంగా సమీపంలోని పోలీసులకు ఆ ఇంటి వివరాలను చేరవేసి క్షణాల్లో అక్కడకి చేరుకునేలా చర్యలు తీసుకుంటారు. దీని వల్ల చోరీ జరుగుకుండా అడ్డుకోవడంతో పాటు నేరస్తుడిని పోలీసులు ఆదుపులోకి తీసుకునేందుకు వీలుంటుంది. ఇలాచేస్తే నగరంలో తాళం వేసి వున్న ఇళ్లలో చోరీలు జరగేందుకు ఆస్కారం లేకుండా చేయవచ్చని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఈ సేవలను పోలీసులు ఉచితంగానే అందిస్తారు. ఊరేళ్లే వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వారు కోరుతున్నారు.

## చార్జీల బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

సీఆర్‌డీఏ అధికారులు ప్రజాయాత్రలో బిజీబిజీగా ఉన్నారు. ఒక్క కృష్ణాజిల్లాలోనే ఇప్పటి వరకూ 3,300 బస్సుల్లో 1.32 లక్షల మందిని తరలించడం ద్వారా రూ. 10.70 కోట్ల వరకూ వ్యయం అయినట్లు చెబుతున్నారు. భవన నిర్మాణాలను చూస్తే ప్రజలకు ఏం అవగాహన వస్తుందో అర్థం కావడంలేదని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు విమర్శిస్తున్నారు. 'అమరావతి ప్రజాయాత్ర' పేరిట ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని దుయ్యబడుతున్నారు.

**చుక్కల్లో విమాన చార్జీలు**

థాయ్‌లాండ్‌కు రూ.8,900..

రాజమండ్రికి రూ.18,105 చార్జీ

విశాఖకు శుక్రవారం 18,226..శనివారం 18,477

విశాఖ, రాజమండ్రి, విజయవాడలకు తీవ్ర రద్దీ

హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్‌కు శుక్రవారం విమాన టిక్కెట్ ధర రూ.8,900. అదే సమయంలో హైదరాబాద్ నుంచి రాజమండ్రికి నేరుగా విమాన సర్వీసు టిక్కెట్ ధర రూ. 18,105. హైదరాబాద్ నుంచి విశాఖకు శుక్రవారం ధర (గురువారం రాత్రి 10గంటలకు పేర్కొన్న వివరాల ప్రకారం) రూ. 18,226గా ఉండగా.. శనివారం అది అమాంతం రూ. 18,477కు పెరిగిపోయింది. విజయవాడకు అసలు టిక్కెట్లే లేవు సరికదా ధరలు గంటగంటకూ పెరిగిపోతున్నాయి. సంక్రాంతికి జనమంతా సొంతూరు బాట పట్టడమే ఇందుకు కారణం. కోస్తాకు బస్సులు, రైళ్లతో పాటు విమానాలు కూడా కిక్కిరిసిపోతున్నాయి. గురువారం నుంచే హైదరాబాద్ నుంచి కోస్తాకు వెళ్లే విమానాలన్నీ ఫుల్ అయ్యాయి. హైదరాబాద్ నుంచి విదేశాలకు వెళ్లేందుకు టిక్కెట్లు దొరుకుతున్నప్పటికీ కోస్తాలోని విశాఖ, విజయవాడ, రాజమండ్రికి మాత్రం ఆశలు సన్నగిల్లుతున్నాయి. శనివారం ఆన్‌లైన్‌లో టికెట్ ధరలు పరిశీలిస్తే థాయ్‌లాండ్‌తో పాటు సింగపూర్, మలేసియా, శ్రీలంక, దుబాయ్ కంటే రాజమండ్రి, విశాఖపట్నం,. విజయవాడకు అధికంగా విమాన టిక్కెట్టు ధరలు ఉన్నాయి.

**బ్యాంకాక్‌లో నాలుగు రోజులు**

హైదరాబాద్ నుంచి రాజమండ్రి ఈ నెల 12న వెళ్లి.. 16న తిరిగి వచ్చేందుకు ఇండిగోలో చార్జీ రూ. 23,662గా ఉంది. అదే సమయంలో టూరిస్టు స్పాట్ అయిన బ్యాంకాక్ (థాయ్‌లాండ్) వెళ్లేవారికి ఎయిరిండియా విమానంలో రౌండ్‌ట్రిప్ చార్జీ రూ. 16,414 మాత్రమే. రూ. 2,000 వీసా చార్జీ, అక్కడ హొటళ్లలో నాలుగు రోజులపాటు బస, పర్యాటక ప్రదేశాల సందర్శన ఖర్చు కలుపుకొన్నా.. రాజమండ్రి ఫ్లైట్ టికెట్ కంటే చాలా తక్కువ. ఇక ఇదే రోజుల్లో పలు దేశాల టికెట్ ధరలు (రానుపోను చార్జీలు కలిపి) చాలా తక్కువగా (శ్రీలంకకు రూ. 22,673, నేపాల్‌కు రూ. 19,449, మలేసియాకు రూ. 22,435, సింగపూర్‌కు రూ. 21,348 ఉన్నాయి.

## కోడి పందేలకు సై

(మొదటిపేజీ తరువాయి)

సేతునా, పూల, కగర పిట్టమారు, డేగ పిట్టమారు కాకిపూల నెమలి పింగళి, కాకిపూల, అబ్రాస్ జాతి కోళ్లు జిల్లాలో కోడి పందేలకు కాళ్లు దువ్వుతున్నాయి.

**అతిథి మర్యాదలకు కొదువే ఉండదు**

జిల్లాలో చిన్నా పెద్ద కలిసి 500 వరకు బరులు సిద్ధం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అధికారపార్టీ నేతలు, కనుసన్నల్లోనే నిర్వాహకులు ఈ ఏర్పాట్లు జరిగాయి. అతిథి మర్యాదలు ఏ విధంగా చేయాలి అన్నదానిపై ఇప్పటికే వీరు దృష్టి సారించి ప్రజాప్రతినిధులు నాయకులకు ఆహ్వానాలు పంపినట్లు సమాచారం. పందేల్లో ఆడేందుకు మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పందెం రాయుళ్లు నగదు పెట్టెలతో బంధువులుగా వస్తుంటారు. వీరికి పందేల నిర్వాహకులు సకల మర్యాదలు చేస్తూ తమ వద్ద పందేలు కాసేలా జాగ్రత్తలు తీసుకుంటారు రాజకీయ నాయకులు ధనిక వర్గీయులు పారిశ్రామికవేత్తలే కాకుండా సినీ ప్రముఖులు సైతం జిల్లాకు రావడం విశేషం.

**అధికారపార్టీ నేతల అండతో..**

సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందేల మసుగులో గుండాట, పేకాట వంటి ఇతర జూదాల ద్వారా రూ.కోట్ల వ్యాపారం జరుగుతుంటుంది. జిల్లాలోని పలు ముఖ్య పట్టణాల్లో రహస్య స్థావరాలో పెద్ద ఎత్తున పేకాట, కోతాట వంటివి కొనసాగిస్తారు. ఇక్కడ ఆయా ప్రాంత ప్రజాప్రతిధులే బరుల్లో నిలిచి ఆటలు జరిగేలా అండగా నిలుస్తుంటారు. దీంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేసేందుకు వెనుకడుగు వేస్తుంటారు. కోడి పందేలు. జూదం ద్వారా వచ్చే సోమ్ము రూ.లక్షల్లో మిగలడంతో కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో ఎలా నిర్వాహకులు ఈ ఆటను వదిలిపెట్టలేక పోతున్నారు.కొన్ని ప్రాంతాల్లో బరుల ఏర్పాటుకు స్థానిక, ప్రజాప్రతిధులకు కొంత సొమ్మును వాటాగా ఇవ్వాల్సి ఉంటుంది.

**జీవితాలు తారుమారైనా... వదలరు**


ఏటా సంక్రాంతికి సంప్రదాయ ముసుగులో పెద్ద ఎత్తున కోడి పందేలు, కోతాట, గుండాట, పేకాట వంటివి యథేచ్ఛగా జరగడం షరామా మూలైపోయింది. వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు ఇక్కడకు తరలివస్తారు కోర్టు ఆదేశాలు హెచ్చరికలు. 144 సెక్షన్ అమలు బైండోవర్ కేసులు వంటివి ఉన్నా పండుగ రోజుల్లో రాత్రింబవళ్లు జూదం పెద్ద ఎత్తున సాగుతూ రూ. కోట్లు చేతులు మారుతుం టాయి. అనేక మంది పేద మధ్యతరగతి వర్గాలతోపాటు ధనికులు సైతం పందేల్లో డబ్బులు పోగొట్టుకొని అప్పులు పాలవడంతో జీవితాలు తారుమారవుతున్నాయి. కొందరైతే తమ పొలాలు, ఇళ్లను పందేలకు కాస్తుంటారు. అయినా వ్యసనం మాత్రం పోదు. వీరివల్ల భార్యాబిడ్డలు మాత్రం నానా అగచాట్లకు గురవుతుంటారు.

# ఆకతాయిల ఆట కట్టించే శక్తి బృందాలు

**విజయవాడలో పాఠశాలలు, కాలేజీలు, బస్టాండు, రైల్వేస్టేషన్లలో యువతులను వేధించే ఆకతాయిల పనిచెప్పడానికి మహిళాపోలీసుల 'శక్తిబృందాలు' రోడ్లపై తిరుగుతున్నాయి. వేధింపుల సమస్యను అరికట్టడానికి మహిళలకు అవగాహన కల్పిస్తూ.. నేరం జరిగిన తర్వాత న్యాయం జరపడం కాకుండా.. నేరం జరగకుండా జాగ్రత్తలు కల్పిస్తున్న శక్తిబృందాల గురించి..**








ఆమె

మహిళలపై లైంగికవేధింపులు, అత్యాచారాలతోపాటు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌ల్లో అత్యధిక కేసులు నమోదవుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో ఉంది. 2015 గణాంకాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై జరిగిన దాడులకు సంబంధించి మొత్తం 15,967 కేసులు నమోదయ్యాయి. కాగా 2016 నాటికి నమోదైన కేసుల సంఖ్య 16,362కి పెరిగాయి. ఇక వాటిలో మహిళల హత్య కేసులు 1,099 నుంచి 1,123 కి పెరిగాయి. 2017 గణాంకాల ప్రకారం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉందని పోలీసు శాఖ లెక్కలు చెబుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు 'షీ టీమ్స్'ను ఏర్పాటు చేశారు. మహిళా పోలీసు బృందాలు మఫ్టీలో రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ ఈవ్ టీజర్లు, ఇతర వేధింపులకు పాల్పడే వారిని అడ్డుకుంటున్నారు. అవి మంచి ఫలితాలు ఇచ్చినట్లు రాజమహేంద్రవరం జిల్లా అర్బన్ ఎస్పీగా పనిచేసి, ప్రస్తుతం విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న రాజకుమారి చెబుతున్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఏకంగా మహిళలపై హింసకు సంబంధించిన కేసుల్లో 34 శాతం తగ్గుదల కనిపించినట్లు ఆమె వివరించారు. విజయవాడలో శక్తి టీమ్ పేరుతో మహిళా పోలీస్ సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. స్వీయ రక్షణతో పాటు, ఆకతాయిల ఆటకట్టించేందుకు అవసరమైన అన్ని రకాల సామర్థ్యాలు పెంచేందుకు ప్రయత్నించారు. సైబర్ క్రైమ్ పెరగడానికి కారణాలు, నివారణకు సంబంధించిన అంశాలలో కూడా శక్తి టీమ్‌లోని 70 మంది మహిళా పోలీసు కానిస్టేబుల్స్‌కి అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాల మీద వారికి అవగాహన కల్పించడంతోపాటు కారు డ్రైవింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, కరాటే వంటి రక్షణ కళల్లో తర్ఫీదు నివ్వడంతో శక్తి టీమ్ పేరుకు తగ్గట్టుగా పనిచేస్తూ.. పలువురి మన్నలను అందుకుంటోంది. వారిలో అత్యధికులు ఎంటెక్, ఎంఈడీ, బీఎల్ వంటి ఉన్నత విద్యను అభ్యసించారు. శిక్షణ పూర్తిచేసుకున్న శక్తిటీమ్స్ 5 క్లస్టర్స్‌గా పని ప్రారంభించాయి. విద్యార్థినులు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఈ శక్తి టీమ్స్ గస్తీ తిరుగుతుంటారు. నేరం జరిగిన తర్వాత కేసు నమోదు కాకుండా, నేరాలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తం చేయడం, అవగాహన పెంచడం, ఆకతాయిలను అడ్డుకోవడానికి శక్తిబృందాలు పనిచేస్తున్నాయి.

శక్తి టీమ్స్ వివిధ పోలీసు స్టేషన్లకు అనుసంధానంగా పనిచేస్తున్నాయి. ఎవరైనా వేధింపులకు పాల్పడుతున్నట్లు '100, 102' అత్యవసర సేవల ద్వారా తమకు సమాచారం అందిస్తే వెంటనే అప్రమత్తమవుతున్నారు. టీమ్ సభ్యులే స్వయంగా నడుపుకుంటూ వెళ్లేలా డ్రైవింగ్‌లో శిక్షణ పొందడంతో 3 వాహనాలను వారికోసం కేటాయించారు. మరో 20 ఈ-సైకిళ్లను కూడా సిద్ధం చేశారు. సైకిళ్లపై, కార్లలో ప్రత్యేక బృందాలు.. నగరంలో గస్తీ తిరుగుతూ ఉండటంవల్ల నేరాలు చేసేందుకు వెనుకాడతున్నారని డీసీపీ రాజకుమారి వెల్లడించారు. ఏపీ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా విజయవాడలో ప్రారంభించిన శక్తి టీమ్ పనితీరు సంతృప్తికరంగా ఉంది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్టీసీ బస్టాండ్‌లు, కాలేజీలు, ఇతర అన్ని ప్రధాన కూడళ్లలో ఈ టీమ్ సభ్యులు.. ఓవైపు అవగాహన కల్పిస్తూ, మరోవైపు ఆకతాయిలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఫలితంగా కాలేజీల వద్ద ఈవ్‌టీజింగ్ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కాలమ్

### భగవంతుడా... రక్షించు ప్రజాస్వామ్యాన్ని....

అడవిలో ఎన్నికలొచ్చాయి. అన్ని చెట్లకు ఓటు హక్కు కల్పించారు. సెలయేరు గొడ్డలి పోటీ పడ్డాయి. పోలింగ్ జరిగింది. చెట్లకు జీవనాధారమైన నీరు ఇచ్చే సెలయేరు గెలుస్తుందని అందరూ విశ్లేషకులు అనుకున్నారు. నిత్యం వృక్షాలను తెగనరికే గొడ్డలి చిత్తుచిత్తుగా ఓడిపోతుందని సర్వే ఫలితాలు ముందే చెప్పాయి. సెలయేటిపై గొడ్డలి భారీ మెజారిటీతో గెలిచింది. ఆశ్చర్యపోయారు అందరూ...!!! ఈ విషయమే వివిధ వృక్షజాతుల నాయకులను అడిగారు.

అవును...నిజమే..... గొడ్డలి వలనే మా జాతి అంతరిస్తుంది...

కానీ... ఆ గొడ్డలి వెనుక వున్న కర్ర మా కులానికి చెందినది. అందుకే...ఓటేశాం...!

## ఏపీలో రెండు కీలక ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన


(మొదటిపేజీ తరువాయి)

కలుపుతూ కేబుల్ వంతెనను నిర్మించనున్నారు. హైదరాబాద్, భద్రాచలం హైవేల మీదుగా నేరుగా అమరావతి వెళ్లేలా వంతెన రూపకల్పన చేస్తున్నారు. భారతీయ యోగముద్రతో ఎల్‌అండ్‌టీ సంస్థ వంతెన డిజైన్ రూపొందించింది. తక్కువ పిల్లర్లు, ఎక్కువ కేబుళ్లతో ఐకానిక్ వంతెన నిర్మాణం జరుగనుంది. అలాగే రూ.750 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళికను రూపొందించారు.



**ఇక్కడ కనిపించేది మేరిమాత డిస్పెన్సరీ, తుళ్లూరు. ఇక్కడికి ఎంతో మంది రోగులు నిత్యం వస్తుంటారు. సీఆర్‌డీఏ వాళ్లు సైడ్ కాల్వ కోసం రోడ్డుని తవ్వడం జరిగింది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. త్వరగా తొలగించిన కల్వర్టును నిర్మించాలని రోగులు, ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.**

## సత్తెనపల్లిలో భారీ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు



**రాజధాని వార్తలు ప్రతినిధి, సత్తెనపల్లి :** గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాద్ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 50 ఎకరాల చెరువులో 36 అడుగుల ఎన్టీఆర్ విగ్రహానికి ఏర్పాటు చేశారు. చెరువును ఆనుకుని ఏడెకరాల స్థలంలో దాదాపు రూ.9కోట్ల వ్యయంతో పార్కును నిర్మించారు. పార్కు చుట్టూ జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని స్పీకర్ తెలిపారు. ఈనెల 18న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరుగనున్నట్లు చెప్పారు.

## ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు లేఖ



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. జగన్ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోదీకి బాబు లేఖ రాశారు. కోడి కత్తి కేసు ఎన్ఐఏ పరిధిలోకి ఎలా వస్తుందని నిలదీశారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని చంద్రబాబు మండిపడ్డారు. గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా బాబు ప్రస్తావించారు. టెర్రరిస్టుల చర్యలు అదుపులోకి పెట్టేందుకు జాతీయ భద్రతా సంస్థను ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్న కేంద్రం, రాష్ట్రాల హక్కులను హరించివేస్తోందని మోదీ చేసిన వ్యాఖ్యలను లేఖలో బాబు పేర్కొన్నారు. అలాగే 2011లో లక్నోలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎన్ఐఏకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేసిన అంశాన్ని బాబు లేఖలో ప్రస్తావించారు.

## 'కశ్మీరీ' సివిల్స్ టాపర్ రాజీనామా

### కశ్మీర్ కేడర్ ఐఏఎస్ షా ఫజల్ సంచలన నిర్ణయం



**శ్రీనగర్ :** జమ్మూ, కశ్మీర్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి షా ఫజల్ తన ఉద్యోగానికి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2009లో జరిగిన సివిల్ సర్వీస్ పరీక్షలో ఆయన మొదటి ర్యాంకు సాధించారు. ఫస్ట్ ర్యాంకు సాధించిన మొదటి కశ్మీరీగా ఆయన చరిత్ర సృష్టించారు. ఐఏఎస్ అధికారి అయినప్పటి నుంచి ప్రజల్లో ఉంటూ.. ప్రజల సమస్యలపై నిత్యం స్పందించే వారు. కశ్మీర్‌లో జరుగుతున్న నిరంతర హత్యలకు నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. హత్యలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామాకు గల కారణాలను తన ఫేస్‌బుక్ పేజీలో రాశారు. కొన్ని హిందుత్వ శక్తుల చేతుల్లో 20 కోట్ల భారతీయ ముస్లింలు వివక్షకు గురవుతున్నారని, వారిని పక్కకు పెడుతున్నారని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో జరుగుతున్న అత్యాచారాలపై స్పందిస్తూ.. ఫజల్ ఆరు నెలల కింద ఓ ట్వీట్ చేశారు. వెంటనే ఆయనపై జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ తర్వాత శిక్షణ కోసం విదేశాలకు వెళ్లి ఇటీవలే వచ్చిన ఫజల్.. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం పేరు ప్రస్తావించకుండా.. కేంద్రంపై పలు విమర్శలు చేశారు 'ఆర్‌బీఐ, సీబీఐ, ఎన్ఐఏ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన గొప్ప కట్టడాన్ని కూలదోయాలని చూస్తున్నారని, దీన్ని ఆపాల్సిన అవసరం ఉంది అని అన్నారు. ఫజల్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో చేరతారని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బారాముల్లా నుంచి పోటీ చేస్తారని భావిస్తున్నారు.

# రిపబ్లిక్ డేలో ఏపీ శకటానికి షాక్

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి షాక్ తగిలింది! జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా శకటాల ప్రదర్శనకు నవ్యాంధ్రప్రదేశ్ శకటం ఎంపిక కాలేదు. శకటాల ప్రదర్శన కోసం అన్ని రాష్ట్రాలకు కేంద్ర రక్షణ శాఖ గత ఏడాది ఆగస్టు నెలలో ఆహ్వానాలను పంపించింది. జాతిపిత మహాత్మా గాంధీ జీవితంతో సంబంధం ఉన్న ఇతివృత్తాలతో వాటిని రూపకల్పన చేయాలని సూచించింది. ఏపీ ప్రభుత్వం విజయవాడ గాంధీకొండ, పొందూరు ఖద్దరు, పల్లిపాడు సత్యాగ్రహ ఆశ్రమం ఇతివృత్తంతో డ్రాయింగ్స్ వేసి పంపించింది. కానీ దీనిని ఎంపిక చేయలేదు.

**ఆశ్చర్యానికి గురి చేసిందని ఏపీ భవన్ అధికారులు**

తమ శకటాన్ని ఎంపిక చేయకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని ఏపీ భవన్ అధికారులు అంటున్నారు. స్వదేశీ ఉద్యమానికి గుర్తింపుగా విజయవాడలోని గాంధీ కొండ పైన గాంధీ పీస్ ఫౌండేషన్ 52 అడుగుల స్థూపం నిర్మించింది. తిలక్ పీస్ ఫౌండేషన్‌కు రూ.1 కోటి సమీకరించే లక్ష్యంతో ప్రజలు చరఖాలు కొనుగోలు చేసి స్వదేశీ ఉద్యమంలో పాల్గొనాలని ఈ కొండమీద నుంచి గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. పొందూరు ఖద్దరు, పల్లిపాడు సత్యాగ్రహ ఆశ్రమానికి చరిత్ర ఉంది.

గాంధీజీ స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్తున్న ఈ ఘట్టాలను రిపబ్లిక్ డే వేడుకగా చాటాలని ఏపీ ప్రభుత్వం భావించింది. ఈ ఇతివృత్తాలను రక్షణ శాఖ పరిశీలించి అంగీకరించింది. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం త్రీడీ నమూనా, ఇతివృత్త సంగీతాన్ని రూపొందించింది. చివరి రౌండ్ వరకు ఏపీ నమూనా పోటీలో ఉంది. కానీ చివరికి ఎంపిక కాలేదు. అదుతేంగా ఉన్నప్పటికీ ఎంపిక కాలేదని అధికారులు వాపోతున్నారు.

**చంద్రబాబు ఆగ్రహం**

ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ శకటానికి అనుమతి ఇవ్వకపోవడంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ పురోగతిని కేంద్ర ప్రభుత్వం భరించలేకపోతోందని ఆయన వ్యాఖ్యానించారని తెలుస్తోంది. రాష్ట్రం పైన కేంద్రం అక్కసు వెళ్లగక్కుతోందన్నారు. ఏపీ శకటానికి అనుమతి నిరాకరించడం దీనికి పరాకాష్ట అన్నారు. రిపబ్లిక్ వేడుకల్లో ఏపీ శకటం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రైతు కష్టం... దళారుల భోజ్యం

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. ప్రస్తుతం 27.838 మంది రైతుల నుంచి 2.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. రూ.510 కోట్లు చెల్లించాల్సి ఉండగా... రూ.478 కోట్లు చెల్లించారు. రూ.32.23 కోట్లు పెండిగ్‌లో ఉంది. కోతలు పూర్తయ్యే సూచనలు కనిపిస్తున్నా ఇంకా కొనుగోలు ప్రక్రియ వేగం పుంజుకోకపోవడంతో రైతుల్లో ఆందోళన నెల కొంటుంది. ఈ నేపథ్యంలో దళారులకు తెగనమ్ము కుంటున్నారు.

**నిబంధనలతో బెంబేలు...**

అనేక ఒడిదుడుకులు అధిగమించి పంట కాపాడుకున్న రైతన్నకు నిబందనలు అడ్డంకిగా మారుతున్నాయి. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలంటే 17 శాతం తేమ ఉండాలి. తడిసిన పంటను ఆరబెట్టి తీసుకెళ్లినా 20శాతం కన్నతక్కువగా ఉంటోంది. దీంతో కొనలేమని వెనక్కు పంపుతున్నారు.

**క్వింటాకు రూ.300 దోపిడి**

జిల్లాలో వివిధ మండలాలకు చెందిన రైతులతో సహా రైతు సంఘం నాయకులు ధృవీకరిస్తున్న లెక్కల ప్రకారం దళారులు 75 కిలోల బస్తాకు ప్రభుత్వ మద్ధతు ధర రూ.1400 కాగా... దళారులు రూ.1200లకు కొనుగోలు చేస్తున్నారు. అంటే క్వింటా రూ.200 వరకూ అన్నదాత నష్టపోతున్నాడు. మరో వైపు ప్రతి 75 కిలోల బస్తా ధాన్యానికి తూకం సమయంలో ఏకంగా 3 కిలోల నుంచి 6 కిలోల వరకూ అదనంగా లాగేస్తున్నారు. అంటే రైతు క్వింటాకు మరో రూ.40 నుంచి రూ. 50 వరకూ కోల్పోతున్నాడు. అంతేకాదు రవాణా చార్జీలు, కూలీల ఖర్చుల నిమిత్తం బస్తాకా మరో రూ.50 చొప్పున రైతుపైనే భారం మోపుతున్నారు. పెథాయ్ తుపాను నేపథ్యంలో ధాన్యం నాణ్యత సరిగా లేదని, రంగు మారిపోయినట్లుగా కనిపిస్తుందని కొర్రీలు వేస్తున్నారు. మర ఆడించాక క్వింటా ధాన్యానికి 67 కిలోల బియ్యం రాదన్న వంకపెట్టి అదనంగా అయిదారు కిలోలు ఇస్తేనే తీసుకుంటామంటూ కొందరు పెద్ద వ్యాపారాలు డిమాండ్ చేస్తున్నారు. వారిని కాదని వెనక్కి తెచ్చుకుంటే రవాణా చార్జీల రూపేణా నష్టపోవడంతో పాటు ఏమీ మిగులదన్న భయంలో రైతులు వారి చెప్పినదానికల్లా ఊకొడుతున్నారు. వీటన్నింటీ ఫలితంగా ఈ ఏడాది రైతన్నకు రమారమి క్వింటాకు రూ.200 రవాణా,అదనంగా లాగుతున్న బియ్యం రూ.100, కలాసీలకు మరో రూ.100తో కలిపి మొత్తంగా రూ.400 వరకూ కోల్పోవాల్సి వస్తోంది. ఎకరానికి 30 బస్తాల దిగుబడి అందుతుందని భావించినా... ఎకరానికి ఒక రైతుకు రూ.12,000 వేలు నష్టపోతున్నారు.


**ఆవేదనలో అన్నదాతలు...**

ఖరీఫ్ ప్రారంభం నుండి వర్షాలు లేక నారు ఎండిపోతుంటే దాన్ని బతికించుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. పంట పొట్ట దశలో ఉండగా వర్షపు జాడ లేకపోవడంతో పంట ఎండిపోయి ఆవేదనతో పొలంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆతర్వాత సరిగ్గా పంట కోతలుపూర్తయి కుప్పలేస్తున్న దశలో పెథాయ్ తుపాను వర్షాలు దెబ్బతీశాయి. ఇన్ని అవరోధాల్ని దాటుకుని చేతికందిన ఎంతో కొంత పంటని అమ్ముకోవడానికి చూస్తే మద్దతు ధర ఇచ్చి కొనేవాళ్లు కానరాకపోగా దళారుల చేతిలో చిక్కి విలవిల్లాడుతున్నారు.

| | |
|---|---|
| **జిల్లాలో ఖరీఫ్ విస్తీర్ణం :** | **2.49 లక్షల హెక్టార్లు** |
| **ధాన్యం సేకరణ లక్ష్యం :** | **9.40 లక్షల మెట్రిక్ టన్నులు** |
| **ఇప్పటి వరకూ సేకరించింది :** | **2.88 లక్షల మెట్రిక్ టన్నులు** |

## అదరహో అనిపించనున్న ఆంధ్రా వంటకాలు


- పర్యాటక శాఖ నేతృత్వంలో ఆహార పండుగ
- విజయవాడ నోవాటెల్‌లో పదిహేను రోజుల పాటు వేడుక




**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** తెలుగునాట సుప్రసిద్ద వంటకాలకు కొదవ లేదు. కాకుంటే అవి కనుమరుగవుతున్నాయి. తెలుగుదనం ప్రతిబింబించే వంటకాలను మరింతగా జనబాహుళ్యంలోకి తీసుకువెళ్లేలా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ నిరంతరం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో నగరంలో నూతనంగా ప్రారంభించిన నోవాటెల్ హోటల్‌లో జనవరి 11 నుండి 24వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుందని ఎపిటిఎ సిఇఒ, ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ విడత ప్రత్యేకత ఏమిటంటే ఏకకాలంలో మూడు చోట్ల ఆహార ఉత్సవాలు నిర్వహించటం. ఇటు విజయవాడ నోవాటెల్‌తో పాటు తిరుపతిలోని హోటల్ మానస్ సరోవర్, కాకినాడలోని మహేంద్రా మిఠాయి వాలాలలో ఈ ఆంధ్రా ఆహార పండుగలు నిర్వహిస్తున్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి స్వయంగా రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా హాజరు కానుండగా ఆహార పండుగను పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఆచార్య జయరామి రెడ్డి ప్రారంభించనున్నారు. జనవరి 12వ తేదీన తిరుపతిలో ఆహార పండుగ ప్రారంభం కానుంది. తిరుపతి, కాకినాడలలో వారం రోజుల వరకే పండుగ పరిమితం కానుండగా, విజయవాడ నోవాటెల్‌లో 15 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా భిన్న రకాల వంటకాలను ఆహార ప్రియులు స్వాగతిస్తున్నా, పోషక విలువలు, రుచుల పరంగా ఆంధ్రప్రదేశ్ వంటకాలు విభిన్నమైనవి. ఈ అంశాన్ని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావటమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఈ వినూత్న కార్యక్రమాన్ని తీసుకుంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బాధ్యతలు చేపట్టిన తదుపరి పర్యాటక శాఖ పరంగా వివిధ పనులు వేగం పుంజుకోగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు సూచనల మేరకు ఈ ఆంధ్రా ఆహార పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. శాఖాహారం కావచ్చు, మాంసాహారం కావచ్చు... రాష్ట్ర ప్రజలకు ప్రీతిపాత్రమైన వంటకాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని బహుళ ప్రాచుర్యం పొందినవి కాగా, మరికొన్ని అంతగా పర్యాటకుల దృష్టిని ఆకర్షించలేక పోయాయి. ఈ లోటును భర్తీ చేయాలన్నదే పర్యాటక శాఖ ఉద్దేశ్యం అంటున్నారు ఆశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా. తెలుగు సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్న మన ఆహారం గురించి నేటి తరంతో పాటు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్యాటకులకు పరిచయం చేయాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టగా, సంవత్సరమంతా కార్యక్రమాలు నిర్వహిస్తామని పర్యాటక, భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి మీనా వివరించారు. గత ఏడాది 15 ఆహార పండుగలను నిర్వహించగా, ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళగిరి చేనేత, లేపాక్షి, అరకు కాఫీ స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు పర్యాటక శాఖ అధికారులు వివరించారు.

# ఏటీఎమ్ నుంచి దొంగ నోట్లు వస్తే ఏం చేయాలి ?

ఏటీఎమ్ వాడకం అంటే ఒకప్పుడు కేవలం పట్టణ వాసులకు మాత్రమే పరిచయం ఉండేది...ఏటీఎమ్ అనగానే ఎనీ టైం మనీ అని అనుకుంటారు కానీ దీని అసలు రూపం 'అసింక్రోనస్ ట్రాన్స్ ఫర్ మోడ్'. ఒకప్పుడు బ్యాంక్‌లో ఉన్న డబ్బులు డ్రా చేయాలంటే బ్యాంక్‌కు వెళ్లి, ఫారాన్ని నింపి క్యాషియర్‌కి ఇస్తే కొంత సేపు వెయిట్ చేసిన తరువాత లైన్‌లో నిలబడి డబ్బులు తీసుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అలా కాదు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏటీఎంలు వచ్చేశాయి. అవి ఎక్కడ పడితే అక్కడ మనకు అందుబాటులో ఉంటున్నాయి. ఈ అధునాతన టెక్నాలజీని వియోగించడం చాలా తేలిక. తక్కువ సమయం పడుతుంది. కేవలం పిన్ నంబరు ఎంటర్ చేయడంతోనే సెకన్లలో డబ్బుతోపాటు మీ మొబైల్ నంబరుకు సంక్షిప్త సందేశం వస్తుంది.



ఎవరైనా మనకు దొంగనోట్లు ఇస్తే ఏం చేస్తాం వాటిని తిరిగి వారికే ఇచ్చేసి మంచి నోట్లని తీసుకుంటాం, కాని ఏటీఎం మెషిన్ నుండే దొంగనోట్లు వస్తే ఏం చెయ్యాలో తెలియక తలపట్టుకుని గగ్గోలు పెడుతాం..

వాటిని కూడా అసలైన నోట్లుగా మార్చుకొనే పద్ధతి ఉందని మనలో చాలా మందికి తెలియదు.. ఏటీఎంలలో దొంగనోట్లు వస్తే మాములుగా బ్యాంకుకి వెళ్లి అడుగుతుంటాం సదరు బ్యాంకు వాళ్ళు తమకు ఏం సంబంధం తెలియదని సమాధానం చెప్పుతుంటారు కానీ రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం నకిలీ నోట్లు వస్తే బ్యాంకు ద్వారానే అసలైన నోట్లని పొందవచ్చు. ఏటీఎం నుంచి డబ్బు విత్ డ్రా చేసినపుడు మీకు నోట్లలో గానీ, లెక్కల్లో తేడా అనిపిస్తే అక్కడే ఏటీఎం లోపలే ఉండి వాటిని లెక్కపెట్టాలి. దొంగ నోట్లు అని అనుమానం వచ్చినా, చిరిగిన నోట్లు వచ్చినా అప్పటికప్పుడే ఏటీఎంలోని సీసీ కెమెరా వైపు ఆ నోట్లను చూపించాలి. ఏటీఎంలో మనకు నకిలీ నోట్లు వస్తే వెంటనే అక్కడ ఉండే సెక్యూరిటీ గార్డుకు సమాచారం ఇవ్వాలి. సెక్యూరిటీ గార్డు దగ్గర ఉండే రిజిస్టర్‌లో మీరు విత్ డ్రా చేసిన మొత్తం, అసలైన నోట్లు ఎన్ని.. నకిలీ నోట్లు ఎన్ని వచ్చాయి.. ఏటీఎం స్లిప్ నెంబర్, నోటు నంబర్లు, తేది, సమయం వివరాలు రాసి సంతకం చేయాలి.

ఆ తరువాత బ్యాంకుకి వెళ్లి మేనేజర్ కి ఒక లెటర్ ద్వారా కంప్లైట్ చెయ్యాలి, లెటర్‌తో పాటు ఏటీఎం స్లిప్ జీరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జీరాక్స్ లని జత చేసి, ఓఏటీఎం వద్ద రిజిస్టర్ లో రాసిన వివరాలని అందించాలి. బ్యాంకు వారు మీ దగ్గర ఉండే నకిలీ నోట్లని తీసుకోని వాటిని స్కాన్ చేసి నకిలీ నోట్ల కాదా..! అని పరీక్షిస్తారు. అవి నకిలీ నోట్లే అయితే మీరు ఇచ్చిన వివరాలని సరి చూసుకొని సరైన నోట్లని తిరిగి ఇస్తారు. ఫిర్యాదు చేసే సమయంలో ఏటీఎం స్లిప్‌ను, నకిలీనోట్లని, కంప్లైంట్ లెటర్‌ను ఫోటోలు తీసి పెట్టుకోవడం ఇంకా ఉత్తమమైనది.. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతి బ్యాంకు పైన చెప్పిన విధంగా చేయాలి.. అలా కాకుండా తమకు ఏం సంబంధం లేదని మాట్లాడితే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయవచ్చు. రిజర్వ్ బ్యాంకు మెయిల్ కి కూడా తమ ఫిర్యాదుతో కూడిన లేఖను మెయిల్ రూపంలో పంపవచ్చు, లేదా స్థానికంగా ఉండే బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసి వెంటనే వారి నుండి తక్షణ సహాయాన్ని పొంది బ్యాంకు నుండి నకిలీ నోట్లకి బదులు అసలైన నోట్లని పొందవచ్చు.

# రాజ్యాంగ సంస్థలపై మోడీ ఉక్కుపాదం

**ఎవరి ఇంట్లోనైనా మంచినీళ్లు తాగితే రుణపడిపోతానని, లేదంటే సహాయం చేయాల్సి వస్తుందని నిక్కచ్చిగా వ్యవహరించే సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను బీజేపీ ప్రభుత్వం మూడు చెరువుల నీళ్లు తాగించింది. 77 రోజులు ఆయనను సెలవుపై పంపింది. సుప్రీంకోర్టు తీర్పుతో విధుల్లోకి చేరిన 36 గంటలలోపే ప్రధాని అధ్యక్షతలోని హైపవర్ కమిటీ ఆయనను అగ్నిమాపక దళానికి బదిలీ చేయడం మహా దారుణం. ఈ వేధింపులతో మనస్థాపం చెందిన ఆయన శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. సీబీఐకి స్వతంత్ర ప్రతిపత్తిని తీసుకొస్తానని గత ఎన్నికల్లో వాగ్దానం ఇచ్చిన ప్రధాని మోడీ కక్ష్యసాధింపు చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారు.**






వాస్తవానికి అలోక్‌వర్మ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టరుగా నియమితులైనప్పటి నుంచి గుజరాత్ మారణకాండలో మోడీ, అమిత్‌షాలను ఆ కేసునుంచి బయటపడేసిన రాకేష్ ఆస్థానాను ప్రత్యేక సీబీఐ డైరెక్టర్‌గా బీజేపీ తెరపైకి తెచ్చింది. ఈ నియామకాన్ని వ్యతిరేకించినందుకు ఆయనపై అనేక అవినీతి ఆరోపణలతో ఆస్థానా కోర్టుల్లో పిటిషన్ దాఖలు చేశారు. నిజానికి ఆస్థానా కూతురు పెళ్లికి ఢిల్లీ స్టార్ హొటళ్లలో రంగరంగ వైభవంగా జరిగింది. అన్ని హొటళ్ల యాజమాన్యాలు వారి సూట్‌లు, గదులు, ఆహార పదార్థాలను అత్యంత చౌకగా అందించాయి. ఈ మేరకు అన్ని జాతీయ వార్తాపత్రికలు కథనాలను కూడా అందించాయికూడా.. మాంసం వ్యాపారి మొయిన్ ఖరేషి కేసులో తనను విడిపించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన సతీష్‌బాబు సేన రాకేష్ ఆస్థానాకు కోటిరూపాయల లంచం ఇచ్చానన్న కేసును సుప్రీంకోర్టు స్వీకరించింది. దీనిపై 10 రోజుల్లో పిటిషన్ దాఖలు చేయాలని శుక్రవారం కోర్టు కోరింది.

"అందరూ ఆత్మపరిశీలన" చేసుకోవాల్సిన సమయం అని అలోక్ వర్మ తన రాజీనామాలో రాశారు.

1979 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన అలోక్ వర్మ తన రాజీనామా లేఖలో, "నేను 2017 జనవరి 31 నాటికే ఉద్యోగ విరమణ వయసును పూర్తి చేసి సీబీఐ డైరెక్టర్‌గా ప్రభుత్వ సేవలో ఉన్నాను. సీబీఐ డైరెక్టర్‌గా పదవీ కాలం 2019 జనవరి 31తో ముగుస్తుంది. అది నిర్ణీత వ్యవధి కలిగిన పదవి. ఇప్పుడు నేను సీబీఐ డైరెక్టర్ కాదు కాబట్టి, ఫైర్ సర్వీస్ డీడీ, సివిల్ డిఫెన్స్, హొమ్ గార్డ్స్ తదితర శాఖల్లో పని చేసేందుకు పదవీ విరమణ వయసు దాటి పోయింది కాబట్టి, నన్ను నేటి నుంచే ఉద్యోగం నుంచి విరమించినట్లుగా గుర్తించండి" అని రాజీనామాలో తెలుపుతూ ఈ లేఖను కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖకు అందజేశారు.

ఇలాంటి పరిస్థితులను ముందుగానే పసిగట్టిన తెలుగు ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ గతేడాది ఏప్రిల్‌లో రాజీనామా చేశారనిపిస్తోంది. ప్రస్తుతం ఆ పదవిలో నియమితులైన మన్నెం నాగేశ్వరరావు ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వ్యక్తి కావడంతో మోడీ అతని నియామకానికి మొగ్గుచూపాడని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

మూడు రోజుల క్రితం సుప్రీం కోర్టు అలోక్‌ను సెలవుపై పంపడాన్ని తప్పుబడుతూ ఆ నిర్ణయాన్ని కొట్టేసిన విషయం తెలిసిందే.. దీనిపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషన్, "రాఫెల్ స్కామ్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారనే భయంతో డైరెక్టర్ పదవిలో తిరిగి నియుక్తులైన మరుసటి రోజే అలోక్ వర్మను హడావుడిగా, ఆయన వాదన వినక ముందే పదవి నుంచి తొలగించారు. విచారణను ఆపడానికి ఎంత తొందరో." అని ట్వీట్ చేశారు.

\- ఖాన్

## మోడీని భయం తొలిచేస్తోంది



మోడీమనస్సును భయం తొలిచేస్తోందని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు.రూ. 30 వేల కోట్ల రూపాయల లబ్ధిని అనీల్ అంబానికి చేకూర్చిన మోడీ దాన్ని కప్పిపుచ్చుకోవడానికి తంటాలు పడుతున్నారు. సీబీఐ చీఫ్ అలోక్‌వర్మను రెండుసార్లు తొలగించడం ద్వారా మోడీ తన అబద్దాల వలలో తానే బందీ అయ్యారని అని పేర్కొన్నారు.

**- రాహుల్ ట్వీట్**

## ఎందుకు భయపడుతున్నారు?



అలోక్‌వర్మను సీబీఐ డైరక్టర్‌గా కొనసాగించడానికి ప్రధానమంత్రి మోడీ ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ ప్రశ్నించారు. హైపవర్ కమిటీ నిర్ణయం వెలువడిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'దాచేందుకు ఏమీ లేకపోతే , ఎందుకు పదవిలో కొనసాగించరు?' అని ప్రశ్నించారు. అక్టోబర్ 23-24 తేదీల్లో జరిగిన పరిణామాలపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విశ్వసనీయతను కోల్పోయింది' అని ఆయన ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

**- ఆనంద్‌శర్మ**

## కోహ్లీసేనకు బీసీసీఐ నజరానా



ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరిస్‌ను నెగ్గి చరిత్ర సృష్టించిన టీమిండియాకు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) భారీ నజనారా ప్రకటించింది. జట్టు సభ్యులకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున నగదు బహుమానం ఇవ్వనున్నట్లు బీసీసీఐ తెలిపింది. జట్టులోని ఆటగాళ్లు అందుకోబోయే బోనస్ మ్యాచ్ ఫీజ్‌కి ఇది సమానంగా ఉంది. ఇక, రిజర్వ్ ప్లేయర్లకు సైతం రూ.7.5 లక్షల నజరానా అందించనున్నట్టు బోర్డు తెలిపింది. ఆటగాళ్లతో పాటు కోచ్‌లకు కూడా రూ.25 లక్షల చొప్పున నగదు బహుమానం ఇవ్వనున్నట్టు తెలిపింది. ఇక ఆటగాళ్లు అందుకోబోయే నగదు బహుమానం మ్యాచ్ ఫీజుకి సమానం కాగా.. ఆటగాళ్ల కంటే కోచ్‌లకు ఇచ్చే నజరానా ఎక్కువగా ఉండటం గమనార్హం.

## 14 నుంచి బంగారం బాండ్ల విక్రయం

### గ్రాము బంగారం ధర రూ.3,214



**ముంబై** : సార్వభౌమ బంగారం బాండ్ల మలి విడత విక్రయం ఈ నెల 14న ప్రారంభం కానుంది. 18వ తేదీ వరకు కొనసాగుతుంది. ఓ గ్రాము బంగారం ధర రూ.3,214గా ఆర్‌బీఐ ఖరారు చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, డిజిటల్ రూపంలో చెల్లించే వారికి గ్రాము బంగారంపై రూ.50ను తగ్గింపు ఇవ్వనున్నట్టు తెలిపింది. దీంతో గ్రాము బంగారాన్ని రూ.3,614కే ఇవ్వనుంది. బ్యాంకులు, స్టాక్ హొల్డింగ్ కార్పొరేషన్, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ద్వారా వీటిని కొనుగోలు చేయవచ్చు. ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా 500 గ్రాముల వరకు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉంది. కనీస పెట్టుబడి ఒక గ్రాము. సార్వభౌమ బంగారం బాండ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా 2015 నవంబర్‌లో ప్రారంభించింది.

## రోహిత్ సెంచరీ వృథా



**సిడ్నీ** : ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడ జరిగిన తొలి వన్డేలో టీమిండియా 34 పరుగుల తేడాతో పరాజయం చెందింది. ఆసీస్ నిర్దేశించిన 289 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తొమ్మిది వికెట్ల నష్టానికి 254 పరుగులకే పరిమితమైన టీమిండియా ఓటమి చెందింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ(133బీ129 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు) సెంచరీ సాధించినప?్పటికీ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. జట్టు స్కోరును పెంచే క్రమంలో రోహిత్ ఏడో వికెట్‌గా ఔటయ్యాడు. రోహిత్‌కు జతగా ఎంఎస్ ధోని(51బీ 96 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్) మినహా ఎవరూ రాణించలేదు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆసీస్ ఐదు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. ఖవాజా(59బీ 81 బంతుల్లో 6 ఫోర్లు), షాన్ మార్ష్(54బీ 70 బంతుల్లో 4 ఫోర్లు), హ్యాండ్ స్కాంబ్(73బీ 61 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లు)లు హాఫ్ సెంచరీలతో రాణించడంతో పాటు మార్కస్ స్టోనిస్(47 నాటౌట్‌బీ 43 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకట్టుకోవడంతో ఆసీస్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది.

అటు తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ వరుస వికెట్లు కోల్పోయి ఆదిలోనే కష్టాల్లో పడింది. నాలుగు పరుగులకే మూడు ప్రధాన వికెట్లు కోల్పోవడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. ఓపెనర్ శిఖర్ ధావన్ డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. ధావన్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. దాంతో గోల్డెన్ డక్‌గా ఔటైన అపప్రథను మూటగట్టుకున్నాడు. ఆసీస్ పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతిని ఆడటంలో తడబడిన ధావన్ వికెట్లు ముందు దొరికిపోయాడు. అటు తర్వాత విరాట్ కోహ్లి(3) సైతం నిరాశపరచడంతో టీమిండియా నాలుగు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆపై వెంటనే అంబటి రాయుడు డక్ ఔట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆ తరుణంలో రోహిత్-ధోనిల జోడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వీరిద్దరూ 137 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేసిన తర్వాత ధోని నాల్గో వికెట్‌గా ఔటయ్యాడు. ఆపై రోహిత్‌కు ఏ ఒక్క ఆటగాడి దగ్గర్నుంచీ సహకారం లభించలేదు. దినేశ్ కార్తీక్(12), రవీంద్ర జడేజా(8)లు నిరాశపరచడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. చివర్లో భువనేశ్వర్ కుమార్(29 నాటౌట్‌బీ 23 బంతుల్లో 4 ఫోర్లు) ధాటిగా బ్యాటింగ్ చేసినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆసీస్ బౌలర్లలో యువ పేసర్ రిచర్డ్‌సన్ నాలుగు వికెట్లు సాధించగా, బెహ్రెన్‌డార్ఫ్, మార్కస్ స్టోనిస్ తలో రెండు వికెట్లు తీశారు. పీటర్ సిడెల్‌కు వికెట్ దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే మంగళవారం జరుగనుంది.

## ఎంఎస్ ధోని మరో మైలురాయి



**సిడ్నీ** : టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. భారత్ తరపున అంతర్జాతీయ వన్డేల్లో పదివేల పరుగుల మార్కును ధోని చేరాడు. ఫలితంగా ఈ ఘనత సాధించిన ఐదో భారత క్రికెటర్‌గా ధోని గుర్తింపు పొందాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో ధోని ఈ ఫీట్‌ను సాధించాడు. ఈ మ్యాచ్‌కు ముందు 9,999 పరుగులతో ఉన్న ధోని.. పరుగు సాధించడంతో పదివేల పరుగుల మార్కును చేరుకున్నాడు. ఆసీస్ పేసర్ రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో సింగిల్ తీసి పదివేల క్లబ్‌లో చేరాడు. నిజానికి గతేడాదే ధోని 10వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. గడిచిన ఏడాది ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లోనే ధోని ఈ మార్కును చేరాడు. అయితే, అందులో 174 పరుగులు ఆసియా ఎలెవన్ తరపున ఆడి చేసినవి కావడం విశేషం. 2007లో ఆఫ్రికా ఎలెవన్, ఆసియా ఎలెవన్ మధ్య జరిగిన ఆ టోర్నీలో మూడు వన్డేలాడిన ధోని 174 పరుగులు చేశాడు. తాజాగా వన్డే ఫార్మాట్‌లో భారత్ తరపున పది వేల పరుగుల మార్కును ధోని అందుకున్నాడు. కాగా, భారత్ తరపున ఇప్పటి వరకూ సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్ , విరాట్ కోహ్లిలు మాత్రమే పది వేల పరుగులు మైలురాయిని అందుకున్నారు. ఈ ఒక్క పరుగుని ధోని గత ఏడాది నవంబర్ నెలలో వెస్టిండిస్ జట్టు భారత్‌లో పర్యటించిన సమయంలోనే అందుకోవాల్సి ఉంది. తిరువనంతపురం వేదికగా జరిగిన ఐదో వన్డేకి ముందు ఎంఎస్ ధోని పది వేల పరుగుల మార్కును చేరుకునేందుకు పరుగు దూరంలో నిలిచాడు. ఆ మ్యాచ్‌లో ధోనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. విండీస్ నిర్దేశించిన 105 పరుగుల లక్ష్యాన్ని భారత్ వికెట్ కోల్పోయి ఛేదించడంతో ధోని బ్యాటింగ్ చేసే అవసరం లేకుండా పోయింది. ఆసీస్‌తో తాజా మ్యాచ్ ధోనికి 333 వన్డే. ఈ మ్యాచ్‌లో భారత్ 4 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. 289 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ మూడు ప్రధాన వికెట్లను ఆరంభంలోనే కోల్పోయింది. ఓపెనర్ శిఖర్ ధావన్ డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. ధావన్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. దాంతో గోల్డెన్ డక్‌గా ఔటైన అపప్రథను మూటగట్టుకున్నాడు. అటు తర్వాత విరాట్ కోహ్లి(3), అంబటి రాయుడు(0)లు కూడా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఈ తరుణంలో రోహిత్ శర్మతో జత కలిసిన ధోని ఇన్నింగ్స్ మరమ్మత్తులు చేపట్టాడు.

# సంక్రాంతి పిండి వంటలు

పండగలు వస్తున్నాయంటే ఏదో ఒక ప్రత్యేకమైన వంటకం తప్పినిసరి. ఇళ్లల్లో మామూలు రోజుల్లో ఎన్ని రకాల కొత్త ప్రయోగాలు చేసినా... ఎలాంటి వంటలు వండినా... పండగనాడు మాత్రం సంప్రదాయమైన వంటలకే ప్రాధాన్యతనిస్తారు మన తెలుగువాళ్ళు. పెద్దవాళ్ళు ఉన్న ఇళ్ళు అయితే ఏమో గానీ ఇప్పటివారికి ఆనాటి వంటలు అసలు చేయడమే తెలీదు. అందుకే ప్రత్యేకమైన పిండి వంటలు, సంప్రదాయ వంటలు మరోసారి గుర్తుచేసుకుందాం.. ఈ పండగ నేపథ్యంలో వాటి తయారీ విధానం తెలుసుకుందాం.

## కజ్జికాయలు



**కావలసిన పదార్థాలు**

మైదాపిండి కేజీ, పుట్నాల పప్పు పావు కేజీ, ఎండుకొబ్బరి 100 గ్రాములు, బెల్లం పావుకేజీ, నూనె వేయించడానికి సరిపడా

**తయారీ విధానం**

మైదాపిండిని తగినన్ని నీళ్ళు పోసి కలిపి చపాతీ ముద్దలా చేసి పెట్టుకోవాలి. దీనిని గంట ముందే తయారుచేసి పెట్టుకోవాలి. పుట్నాలపప్పు, బెల్లం, ఎండుకొబ్బరి మెత్తగా పొడి చేసుకుని ఉంచుకోవాలి. మైదాపిండి చిన్నచిన్న ఉండలుగా చేసుకుని పూరీల్లా ఒత్తుకోవాలి. దీనిని కజ్జికాయల పీటలో పెట్టుకుని మధ్యలో తయారుచేసి పెట్టుకున్న ఎండుకొబ్బరి, పుట్నాలపప్పు పొడిని పెట్టి చివరలు మూసుకుపోయేలా నొక్కాలి. వీటిని నూనెలో వేసి వేయించుకోవాలి. తర్వాత డబ్బాలో పెట్టుకుంటే ఎక్కు రోజులు నిల్వ ఉంటాయి.

## జంతికలు



**కావలసిన పదార్థాలు**

బియ్యం కేజీ, మినపగుళ్ళ 100 గ్రాములు, వేయించిన శనగపప్పు 50 గ్రాములు, వాము 5 గ్రాములు, ఉప్పు, కారం తగినంత

**తయారీ విధానం**

మినపగుళ్ళు దోరంగా వేయించాలి. బియ్యం, మినపగుళ్ళు వేయించిన శనగపప్పు, వాముతో కలిపి మర పట్టించాలి. ఈ పిండిని గోరువెచ్చని నీటితో కలుపుకుని ముద్దలా చేసుకోవాలి. చిన్నచిన్న ముద్దలుగా చేసుకుని చక్రాల గిద్దలలో తీసుకుని వాటిని కళాయిలో పెనుంచి తిప్పుతూ వేయాలి. నూనెలో బాగా వేగిన తర్వాత తీసేసి కొద్దిసేపు ఆరనివ్వాలి. తర్వాత వాటిని గాలి చొరబడని డబ్బాలలో నిల్వ చేసుకోవాలి. ఇలా తయారుచేసిన జంతికలను పొడి డబ్బాలలో నిల్వ చేసుకోవాలి. ఇలా చేస్తే నెల రోజుల వరకూ నిల్వ ఉంటాయి.

## చెక్కలు



**కావలసిన పదార్థాలు**

బియ్యంపిండి కేజీ, పచ్చిశనగపప్పు 100 గ్రాములు, కరివేపాకు కొద్దిగా, వెన్న 50 గ్రాములు, ఉప్పు, కారం తగినంత

**తయారీ విధానం**

ముందుగా పచ్చి శనగపప్పును నానబెట్టు కోవాలి. తర్వాత బియ్యంపిండిలో వేసి దీనిని కలపాలి. ఇందులోనే ఉప్పు, కారం, వెన్న కూడా వేసి తగినంత నీరు పోసి చపాతీ పండిలా కలపాలి. వీటిని తీసి నూనెలో వేయించుకోవాలి. వేయించుకున్నాక వాటిని పొడి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఇవి నెల రోజుల వరకూ నిల్వ చేసుకోవాలి

## బొబ్బట్లు



**కావలసినవి**

పచ్చికొబ్బరి- రెండు కప్పులు,
బెల్లం-పావుకిలో, నూనె-తగినంత, యాలకులు పొడి- రెండు చెంచాలు,
మైదా-పావుకిలో.

**తయారుచేసే విధానం**

మైదాపిండిలో కొంచెం ఉప్పు, కొంచెం నూనె కాచి పోసి పూరీల పిండిలా కలపాలి. ఒక గిన్నెలో బెల్లం తరుగు వేసి కొంచెం నీటిలో కరగనిచ్చి కొబ్బరి తురుమును కూడా వేసి సన్నని మంట మీద పాకంగా రానివ్వాలి. కొంచెం చిక్కబడ్డాక లేలకుల పొడిని బాగా కలిపి చల్లారాక చిన్న చిన్న ఉండలు చేసి పూరీల్లా ఒత్తి దాంట్లో కొబ్బరి ఉండను పెట్టి మొత్తం మూసేసి మళ్లీ బొబ్బట్లలాగా పలుచగా ఒత్తుకుని పెనం మీద వేసి కొంచెం కొంచెంగా నెయ్యి వేస్తూ రెండు వైపులా ఎర్రగా కాల్చుకుని వేడి వేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి.

## పూర్ణం బురెలు




**కావలసిన వస్తువులు**

శెనగపప్పు-1కిలో
బెల్లం-3/4కిలో
మినప్పప్పు-పావుకిలో
బియ్యప్పిండి-1కిలో
నూనె-ఒకటిన్నర కిలో
ఉప్పు-చికెడు

**తయారుచేసే విధానం**

బెల్లం మెత్తగా తురుమి ప్రక్కన వుంచుకోవాలి. యాలకులు మెత్తగా పొడికొట్టుకోవాలి. మినప్పప్పు నానబెట్టి గ్రైండర్‌లో వేసి పిండిగా రుబ్బుకోవాలి. బియ్యపిండితో కలిపి తగినంతగా ఉప్పువేసి అరగంట సేపు నాననివ్వాలి. శెనగపప్పుని శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేసి మెత్తగా ఉడకనివ్వాలి. తర్వాత నీటిని వంచి, పప్పు తడిలేకుండా చూసుకోవాలి. బాగా మెత్తగా మెదపాలి. దీనిలో తురిమిన బెల్లం వేసి, స్టవ్ మీద సన్నని సెగమీద వుంచి కలుపుతూ వుండాలి. దగ్గరగా ముద్దగా అయ్యేవరకూ వుంచాలి. యాలకుల పొడివేసి స్టవ్ మీద నుండి దించాలి. చల్లారాక నిమ్మకాయ సైజంత వుండలు చేసుకోవాలి. పొయ్యిమీద పెద్ద మూకుడు పెట్టి, అందులో కిలోన్నర నూనె వేసి బాగా కాగనివ్వాలి. ముందుగా చేసిపెట్టి వుంచుకున్న వుండల్ని మినప్పప్పు, బియ్యపిండి మిశ్రమంలో ముంచి నూనెలో వేసి ఎర్రగా వేగనివ్వాలి. వేసేటప్పుడు వుండ చితకకూడదు. కొద్దిగా నిదానంగా కలపాలి.

## బూరెలు



**కావలసినవి**

గోధుమపిండి-రెండు కప్పులు,
-బియ్యప్పిండి-ఒక కప్పు,
ఎండు కొబ్బరి తురుము-ఒక కప్పుచ బెల్లం-ఒక కప్పు, పంచదార-అరకప్పు,
యాలకులపొడి-రెండు చెంచాలు,
నెయ్యి-రెండు చెంచాలు, నీళ్లు-మూడు కప్పులు, నూనె-వేయించడానికి తగినంత.

**తయారు చేసే విధానం**

గోధుమ, బియ్యం పిండులను జల్లించుకోవాలి, వెడల్పాటి గిన్నెలో నీటిని పోసి మరుగుతుండగా అందులో నెయ్యి వేసి పంచదార, బెల్లం తరుగు, వేసి కరిగాక యాలకుల పొడిని కూడా వేయాలి. కరిగిన ఈ పాకంలో కొబ్బరితురుము, గోధుమ బియ్యంపిండి మిశ్రమాన్ని కలిపిపోస్తూ ఉండలు కట్టకుండా బాగా కలియతిప్పి కలిపేలా చేయాలి. తర్వాత ఒక నిముషం సేపు మూత పెట్టి దించి చల్లార్చి పిండిని చేత్తో బాగా కలిపి మెత్తగా ముద్దచేసి చిన్న చిన్న ఉండలుగా కట్టాలి. బాండీలో నూనెను వేగనిచ్చి ఈ ఉండలను అరిటాకుమీద గాని ప్లాస్టిక్ కవరుపైనగాని పెట్టి బురెలుగా ఒత్తి నూనెలో వేసి బాగా దోరగా సన్నపు సెగమీద వేయించాలి. బూరెలు బాగా పొంగి తినడానికి, చూడటానికి చాలా బాగుంటాయి. ఇవి వారం రోజుల వరకు నిల్వ ఉంటాయి.

## అరిసెలు



**కావలసిన పదార్థాలు**

బియ్యం కేజీ, బెల్లం అరకేజీ, నువ్వులు 100 గ్రాములు, యాలకులు 5 గ్రాములు, నెయ్యి 50 గ్రాములు

**తయారీ విధానం**

ముందుగా బియ్యాన్ని రోజున్నర నానబెట్టాలి. నానబెట్టిన బియ్యాన్ని పిండి పట్టించాలి. బెల్లంలో గ్లాసు నీళ్ళు పోసి ముదురు పాకానికి వచ్చిన తరువాత దానిలో యాలకల పొడి, నెయ్యి వేసి బియ్యంపిండిని పోస్తూ కలియ తిప్పుకోవాలి. తయారైన ముద్దని చిన్నచిన్న ఉండలుగా చేసుకుని బాదం లేదా అరిటాకుపై పెట్టి పలచగా చిన్న చపాతీల్లా గుండ్రంగా వత్తుకోవాలి. వీటిమీద నువ్వులు అద్ది నూనెలో వేయించుకోవాలి. అరెసెల చెక్క మీద ఒత్తుకుంటే మరింత అందంగా వస్తాయి. ఇవి నూనెలో వేగితే అరెసెలు రెడీ. అరెసెల తయారీలో పాకమే కీలకం. ఇది ఏ మాత్రం తేడా వచ్చినా అరిసె పాడైపోతుంది. విరిగిపోతుంది. ఎక్కువరోజులు నిల్వ ఉండదు. పాకం తయారీ విషయంలో ఇంట్లో పెద్దవాళ్ళను లేదా బాగా తెలిసినవాళ్ళను దగ్గరుంచుకోవడం మంచిది. ఆర్నెల్ల వరకూ పాడైపోకుండా ఉండేలా అరెసెలు తయారుచేసేవాళ్ళు ఉన్నారు. ఈ వంటకానికున్న రుచి, ఆకర్షణ ఇంక దేనికీ లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా సంక్రాంతి వేళ చాలా మంది అరెసెలే తయారు చేస్తారు.

Printed & Published by Shri .Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan.
Decl.Before SDM Guntur dt. 07/01/2019,Volume -1, Issue -1